క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్యులు రవీందర్ తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహించగా, మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరైనట్లు పేర్కొన్నారు. కంటి శుక్లాల తొలగింపు కోసం అవసరమైన వారిని శస్త్ర చికిత్సల సిఫారసు చేసినట్లు వివరించారు. వైద్య సిబ్బంది మల్లికార్జున్, తదితరులున్నారు.

56 సార్లు రక్తదానం



రామారెడ్డి: ఉప్పల్వాయికి చెందిన జీడిపల్లి శ్రీనివాస్ రక్తదానం చేయడంలో యువతకు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. మెడికల్ రిప్రజెంటేటివ్ మేనేజర్‌గా పనిచేసే జీడిపల్లి శ్రీనివాస్ ఎవరు రక్తం కావాలని అడిగినా వెంటనే స్పందించి రక్తదానం చేయడానికి ముందుకు వస్తారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి అనేకసార్లు రక్తదానం చేసినందుకు రోటరీ క్లబ్ వారు అవార్డుతో శ్రీనివాస్‌ను సత్కరించారు. ఇప్పటి వరకు శ్రీనివాస్ 56 సార్లు రక్తదానం చేశారు.

కేజీబీవీ పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కేజీబీవీని ఎంఈవో వెంకటేశం సోమవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని తరగతి గదులు, బాత్రూంలు, అలాగే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో పోలీసులు సోమవారం వాహనాలను ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పట్టణ శివారులో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వారు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో సదుపాయాలను కల్పిస్తుందని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ దుప్పట్లు విద్యార్థులకు చలి కాలంలో ఎంతో మేలు చేస్తాయన్నారు. క్రమశిక్షణతో చదివి రాబోయే వార్షిక పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే.శ్యాంగోపాల్‌రావు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం సుభాష్‌రోడ్డులోని బాంబేక్లాథ్ హౌస్ వద్ద అన్నదానం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్యాంగోపాల్‌రావు తన పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు, పేదలకు అన్నదాన కార్యక్రమం, రక్తదానం నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాత ధర్మరాజు, పీవీ నరసింహం, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బీబీపేట పోలీసు స్టేషన్‌లో..జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్



నిజాంసాగర్ పీఎస్‌లో ..రమేశ్ గౌడ్



భిక్కనూరులో.. మాజీ సర్పంచ్ తున్కి వేణు

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

జిల్లా వ్యాప్తంగా సోమవారం మాజీ సర్పంచులను, పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను ముందస్తు అరెస్టులు చేశారు. సర్పంచులు హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా నుంచి ఎవరూ వెళ్లకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆ తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ..గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసి ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయామని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



మాచారెడ్డి పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

అర్హులైన వారికే ఇందిరమ్మ గృహాలు



సదాశివనగర్‌లో సర్వే చేపడుతున్న పంచాయతీ కార్యదర్శి మాధవీలత



బీబీపేటలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అర్హులైన వారికే ఇందిరమ్మ గృహాలను కేటాయిస్తారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ గృహ సర్వేను పంచాయతీ కార్యదర్శి మాధవీలత ఆధ్వర్యంలో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చిందం రాజయ్య, ఇందిరమ్మ కమిటీ నాయకులు లింబారెడ్డి, మాజీ ఎంపీటీసీ బీరయ్య, మాజీ వార్డు సభ్యుడు జగ్గ బాల్‌రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జొన్నల రాజు, నాయకులు పాల్గొన్నారు.

బీబీపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే మండలంలోని ఆయా గ్రామాలలో కొనసాగుతుంది. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 6,715 కుటుంబాలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా సోమవారం నాటికి 690 కుటుంబాల సర్వే పూర్తి చేశామని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో కార్యదర్శులు రోజుకు 50 చొప్పున సర్వే పూర్తి చేస్తున్నారని అన్నారు. దరఖాస్తుదారులు ఖాళీ స్థలం ధ్రువపత్రాలు, టాక్స్ పేపర్, కరెంట్ బిల్లు కార్యదర్శులకు చూపించాలని తెలిపారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులతో పాటు, మండలంలోని 31 గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన సర్వే కొనసాగుతున్నది. మండలంలోని 31 గ్రామాలలో పంచాయతి కార్యదర్శులు ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలతో పాటు ఫోటోలను సేకరిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం స్థలం ఉన్న వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మికం

పంచముఖ శివాలయంలో పూజలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలో గల పంచముఖ శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం రుద్రాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం అనేది విశేషమైనదని అన్నారు.

ముత్యాల పోచమ్మ వార్షికోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గణపతి ఉపాసకులు సంజీవ్‌రావు శర్మ ఆధ్వర్యంలో ముత్యాల పోచమ్మ ఆలయం వార్షికోత్సవాలు జరిపారు. వేకువ జాము నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి లక్షా 8 వేల 10 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలో మండల వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గునిగెరి హన్మండ్లు మాట్లాడుతూ.. వారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. పిల్లలు జీవితంలో ఎలా ఉండాలి..పెద్దలు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలన్న విషయాలపై వికారాబాద్ నుంచి వచ్చిన భక్తశ్రీ సేవ కుమార్ వివరించారు. వారధి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి గోపాల్, సభ్యులు కిషన్, అనిల్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 27న మాదిగ కళాకారుల మహాప్రదర్శన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హైద్రాబాద్‌లో వచ్చే నెల 27న తలపెట్టిన మాదిగ కళాకారుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ జిల్లా పర్యవేక్షకులు మంథని సామేల్ మాదిగ అన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీయస్ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో ముప్పెళ్ల పోరాట వల్ల సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని, సుప్రీంకోర్టు తీర్పు అమలును అడ్డుకోవడానికి కొంతమంది స్వార్థపరులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. నేతలు కుంటోళ్ల యాదయ్య, తొంట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీడీ కార్మికుల పింఛన్లపై అసెంబ్లీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడాలని బీడీ కార్మికులు కోరారు. తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్‌లో సోమవారం బీడీ కార్మికులు సమావేశమై మాట్లాడారు. ఎండ్రియాల్ గ్రామంలో సుమారు 70మంది బీడికార్మికులున్నారని, అందరం పింఛన్‌లకు అర్హులమని, పింఛన్ల కోసం 7 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తునామని వాపోయారు. అందులో 40 మందికి పింఛన్లు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఎన్నిసార్లు మండల, జిల్లా కార్యాలయాలకు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మదన్‌మోహన్ స్పందించి అసెంబ్లీలో మాట్లాడి, అర్హులైన బీడీ కార్మికులకు పింఛన్లు వచ్చేలా చూడాలని కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న బీడీ కార్మికులు

సమాచారం..

డాక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో ఒప్పంద పద్ధతిన మెడికల్ అధికారిని నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.72 వేల గౌరవ వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నిరసన

కామారెడ్డి అర్బన్: లగచర్ల రైతులపై అక్రమ పోలీసు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తామని పార్టీ పట్టణ అధ్యక్షుడు జె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి, అయ్యవారిపల్లి గ్రామాల్లో మంగళవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంకీర్త్ సోమవారం తెలిపారు. భిక్కనూరు 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి దోమకొండ 132 కేవీ సబ్‌స్టేషన్‌కు డబుల్ సర్క్యూట్ లైన్ వేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భిక్కనూరు మండల కేంద్రంలోని అవ్వగారితోట ఫీడర్‌కు చెందిన వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంక్షిప్తం

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

మద్నూర్(జుక్కల్): 1978లో జుక్కల్ నియోజకవర్గం రిజర్వ్‌గా మారి 50 సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు జుక్కల్‌కు మంత్రి పదవి ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎలాగైనా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే మంత్రి పదవి కేటాయిస్తే సాధ్యమవుతుందన్నారు.

బీఆర్‌ఎస్ పోరాట ఫలితమే మెస్‌చార్జీల పెంపు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీఆర్‌ఎస్ పార్టీ పోరాట ఫలితంగానే మెస్ చార్జీలు పెంచారని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వల్లే గురుకులాల్లో మెస్ చార్జీలు పెంచారన్నారు. నాయకులు నర్సింలు గౌడ్, సాయిలు, సీహెచ్ శంకర్, వెంకటి, భాస్కర్ ఉన్నారు.

పట్టణ మేరు సంఘ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ మేరు సంఘం ఎన్నికలు సోమవారం సంఘం ఎన్నికల అధికారులు ఆర్.గణేష్, కొట్టు రఘునాథ్, ఎస్.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా గట్ల భాను, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల దేవేందర్, కోశాధికారిగా గట్ల బాలచందర్ ఎన్నికయ్యారు.

అధికారుల సహకారంతో స్థలం మంజూరు

దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి అధికారుల సహకారంతో రెవెన్యూ శాఖ స్థలం మంజూరు చేసిందని దోమకొండ ఎక్సైజ్‌శాఖ సీఐ మధుసూదన్‌రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో పన్నెండున్నర గుంటల భూమి మంజూరు చేశారన్నారు. కాగా కార్యాలయ భవన నిర్మాణానికి తాను జిల్లా అధికారులకు ఎలాంటి నివేదిక అందించలేదని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ బూత్ కమిటీలకు అధ్యక్షుల నియామకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలకు బీజేపీ బూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మర్కల్ గ్రామంలో 65వ బూత్ నంబర్‌కి సాయిలు, 66 బూత్ నంబర్‌కు కుంట సుభాష్‌రెడ్డిలను నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు చక్రధర్ గౌడ్, గొల్ల ప్రవీణ్, లింగారావు, సంకరి విఠల్, నాయిని మహిపాల్ యాదవ్, భాస్కర్ రెడ్డి, పోలబోయిన సాయిలు, జైపాల్ రెడ్డి, గంగాధర్ రావు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్‌రైట్స్‌డేకు మంగళం..?

- నిర్వహణపై అధికారుల అనాసక్తి
- నెలలు గడుస్తున్నా ఊసెత్తని అధికారులు
- ప్రతినెలా నిర్వహించాలని డిమాండ్

బాన్సువాడ రూరల్: గ్రామాలు, దళితవాడల్లో సివిల్ రైట్స్‌డే(పౌరహక్కుల దినం) నిర్వహణపై అధికారులు ఆసక్తి చూపించడం లేదు. దీంతో కొన్ని నెలలుగా బాన్సువాడ డివిజన్‌లోని వివిధ మండలాల్లో సివిల్ రైట్స్‌డే నిర్వహించడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కులవివక్షత, అంటరానితనం, అస్పృశ్యత, అత్యాచారాల నివారణ కోసం మండల స్థాయి అధికారులు సివిల్‌రైట్స్ డే ద్వారా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రతి నెలా చివరి ఆదివారం తహసీల్దార్, ఎస్సై, సాంఘిక సంక్షేమాధికారి, ఎంపీడీవో, స్త్రీశిశు సంక్షేమశాఖ తదితర మండల అధికారుల బృందం ఏదో ఒక గ్రామం, దళితవాడల్లో పర్యటించాల్సి ఉంది. వీటి ద్వారా గ్రామాల్లో దళితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలి. దళితవాడలు, కాలనీల అభివృద్ధితో పాటు వారికి అక్షరాస్యత, మెరుగైన వైద్యం, జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కొంత కాలంగా బాన్సువాడ డివిజన్‌లోని వివిధ మండలాల్లో అధికారులు సివిల్‌రైట్స్ డే నిర్వహించడం లేదు. దళితులపై అకృత్యాలు పెరిగి, వారిపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలుగా పెరిగిపోతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ హోటళ్లలో రెండు గ్లాసుల పరిస్థితి.. దేవాలయాల ప్రవేశానికి నిరాకరణలాంటి జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మనిషిని మనిషిగా చూడాలని, చట్టం ముందు అందరూ సమానమేనన్న భావన, ఆత్మస్థైర్యం కల్పించేందుకు ఈ సివిల్‌రైట్స్‌డేను నిర్వహిస్తుంటారు. దళితుల హక్కులు, వారికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో పాటు పౌరుల బాధ్యతలను ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా గుర్తించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దళితులను చైతన్యపర్చాలి



ఇప్పటికీ ప్రతి రోజు ఎక్కడో ఒకచోట దళితులపై అరాచకం జరుగుతూనే ఉంది. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన దళితులకు వారి హక్కులు, విధులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై చైతన్యపర్చాలి. ప్రతి నెలా సివిల్‌రైట్స్‌డే నిర్వహించి స్థానిక దళిత నాయకులను, విద్యావంతులను ఆహ్వానించాలి.

– ఎర్రవటి సాయిబాబా, దళిత నాయకులు, హన్మాజీపేట్

ఆత్మస్థైర్యం కల్పించాలి



ప్రభుత్వ ఆదేశాను సారం ప్రతినెలా సివిల్‌రైట్స్ డే నిర్వహించాలి. తద్వార దళితుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. కొన్ని నెలలుగా అధికారులు ఆ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ చూపాలి.

– నర్సింలు, ఏఎంసీ మాజీ చైర్మన్, బాన్సువాడ

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : గ్రామీణ ప్రాంత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆకాంక్షించారు. సోమవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో ఆడి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు. అనంతరం క్రీడకారులను పరిచయం చేసుకున్నారు.

వివిధ విభాగాల్లో రాణించిన క్రీడాకారులు

బాలురకు అండర్-17, అండర్-20 విభాగాల్లో కుస్తీ పోటీలు నిర్వహించారు. అండర్ -17 లో 41-45 కేజీల విభాగంలో అనిల్(పోచారం), 48 కేజీల విభాగంలో జైపాల్(నస్రుల్లాబాద్), 51 కేజీల విభాగంలో ఎం.శ్రీకాంత్(నెమ్లి), 55 కేజీల విభాగంలో శ్రావణ్ (దామరంచ), 60 కేజీల విభాగంలో ప్రవీణ్(పెద్దకొడప్‌గల్)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-20లో 60 కిలోల విభాగంలో ప్రశాంత్(ఆరేడు), 61 కిలోల విభాగంలో భూషణ్(అచ్చంపేట్), 65 కిలోల విభాగంలో వినోద్(బాన్సువాడ)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నాయకులు అంజిరెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు వెంకట్, సాయిలు, పీఈటీలు తారాచంద్, అనిల్, కుమార్, సాయిలు ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాసుల బాల్‌రాజ్

ఏడో రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కామారెడ్డి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు ముగ్గులు వేసి, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, తమని రెగ్యులర్ చేయాలని.. అప్పటివరకు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే విద్యార్థులతో సహా రోడ్లపై బైఠాయించి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పలు సంఘాల మద్దతు

విద్యార్థి సంఘాల నాయకులు, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు ఎడ్ల రాజు, ఎండీఎం జిల్లా అధ్యక్షుడు కృష్ణ గౌడ్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ రాజు, పీఆర్‌టీయూ పిట్లం మండల బాధ్యులు పాల్గొని మద్దతు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, హరిప్రియ, మైసకల, కాళిదాస్, శైలజ, వనజ, గంగాప్రసాద్, దినేష్ లక్ష్మణ్, శంకర్, కృష్ణ, నవీన్, లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

క్రికెట్‌లో సత్తా చాటుతున్న ఆముద మణికంఠ



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన ఆముద మణికంఠ క్రికెట్‌లో సత్తాను చాటాడు. మణికంఠ ఇటీవల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం విదితమే. వారం రోజులుగా ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న పోటీలలో నిజామాబాదు ఉమ్మడి జిల్లా పోటీలలో 7 ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. మొదటి మ్యాచ్‌లోనే ప్రతిభ చూపి పలువురి ప్రశంసలు పొందుతున్నాడు.

జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటిన విద్యార్థులు, యువకుడు



రాజంపేట: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో రాజంపేట మండల ఆర్గొండ గ్రామానికి చెందిన తిప్పారం సాగర్ సీనియర్స్ విభాగంలో తన ప్రతిభ చాటాడు. 100 మీటర్ల పరుగు పందెంలో, లాంగ్ జంప్‌లలో ద్వితీయా స్థానాలు సాధించి అందరి మన్ననలు పొందాడు. అదే విధంగా జూనియర్స్ విభాగంలో రాజంపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి టి.విశ్వతేజ గౌడ్ 1500 మీటర్ రన్నింగ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు వీరికి అభినందలు తెలిపారు.